ప్రభాకర్‌రెడ్డి గన్‌మెన్‌కు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

తల్లడిల్లిన ఉక్కు గుండె

- ప్రభాకర్‌రెడ్డిపై దాడితో సీఎం కేసీఆర్ బిగ్భాంతి
- నారాయణఖేడ్ సభలో జీరగొంతుతో ప్రసంగం
- హైదరాబాద్ రాగానే దవాఖానకు వెళ్లి పరామర్శ
- ప్రభాకర్‌రెడ్డి గన్‌మెన్‌కు నమస్కరించిన సంస్కారం

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ఉక్కుగుండె ఒక్కసారిగా తల్లడిల్లింది. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగిందనే వార్త తెలిసి బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. తన కుటుంబసభ్యుడి లాంటి ప్రభాకర్‌రెడ్డిపై దాడిట్లా జరిగిందని ఆవేదన చెందారు. ప్రజాఆశీర్వాద సభల్లో భాగంగా సోమవారం జుక్కల్, బాన్సువాడ, నారాయణఖేడ్ నియోజవర్గాల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. జుక్కల్‌లో సభ పూర్తి అయి హెలిప్యాడ్ వద్దకు రాగానే ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరిగిందనే విషయం తెలుసుకున్న సీఎం కేసీఆర్.. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో హెలికాప్టర్‌లో కూర్చొని మంత్రి హరీశ్‌కు ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. నారాయణఖేడ్ సభలో కేసీఆర్ ఉద్విగ్నానికి లోనై, జీరగొంతుతో మాట్లాడారు. 'మీ ఉత్సాహం చూస్తుంటే చాలాసేపు మాట్లాడాలని నాకూ ఉన్నది. కానీ, దురదృష్టం. కాంగ్రెస్ పార్టీ దద్దమ్మలు, ప్రజల చేతుల్లో గెలవటం చేతకాక మన ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడికి తెగబడ్డరు. ప్రచారంలో ఉన్న ప్రభాకర్‌రెడ్డి మీద కత్తులతో దాడి చేసినరు. ఇదెంతో బాధాకరం. మంత్రి హరీశ్‌రావు కూడా ఈ సభకు రావాల్సి ఉండే. కానీ, ఆయన వెంటనే అక్కడికి పరిగెత్తుకునివెళ్లి యశోద హాస్పిటల్‌లో చేర్పించారు. రక్తం కారుతున్నది. మూడించుల లోతుకు కత్తి దిగింది. అందుకే వెంటనే ప్రభాకర్‌రెడ్డిని యశోద దవాఖానకు తీసుకెళ్లి ప్రాణాలు కాపాడినరు. దేవుని దయవల్ల ఆయన ప్రాణానికి అపాయం లేదు. 50 నుంచి 60 మంది మన పార్టీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని రక్తం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నరు. నేను వెంటనే అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉన్నది. నేను జుక్కల్‌లో ఉన్నప్పుడే మెసేజ్ వచ్చింది. వెంటనే వెళ్లాలని నిర్ణయించుకున్న. కానీ, బాన్సువాడలో లక్షకు పైగా జనం వచ్చినారు. ఇక్కడా అంతేసంఖ్యలో మీరొచ్చినరు. ప్రాణాపాయం లేదని తెలిసినంక కాస్త కుదుటపడ్డ. మళ్లీ ఆలోచించిన. జనం భారీగా తరలివచ్చినరు. మళ్లీ నేను రాకుంటే నర్వస్ అయితరని, నమస్కారం పెట్టి పోదామని చెప్పి ఇంతదూరం వచ్చిన' అని అన్నారు. హైదరాబాద్ వచ్చినప్పటి నుంచి దవాఖానలో ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించే వరకు ఆయన ఆందోళనలోనే కనిపించారు. పరామర్శ తర్వాతే కాస్త కుదుటపడ్డారు.

గన్‌మెన్‌కు నమస్కారం

దవాఖానలో ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించి తిరిగి ప్రగతిభవన్‌కు బయలుదేరేముందు ప్రభాకర్‌రెడ్డి గన్‌మెన్‌ను సీఎం కేసీఆర్ దగ్గరికి పిలిపించుకొని నమస్కరించారు. గన్‌మెన్ సమయస్ఫూర్తితో నిందితుడి నిరోధించారని, దాంతో ప్రమాద తీవ్రత తగ్గిందని వైద్యులు సీఎంకు వివరించారు. దీంతో గన్‌మెన్‌ను దగ్గరికి తీసుకొని నమస్కారం చేసి తన సంస్కారాన్ని చాటుకున్నారు.

కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్న గటాని రాజు (ఫైల్)

పచ్చటి తెలంగాణలో నెత్తుటి రాజకీయం

I తరువాయి...

దాచుకున్న కత్తితో దాడి చేశాడు. వెంటనే అప్రమత్తమైన ఎంపీ వ్యక్తిగత సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు ఆయనను హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసి 1 గంట 45 నిమిషాల్లో అంబులెన్స్‌లో మధ్యాహ్నం 2:56 గంటలకు సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానకు తీసుకొచ్చారు. నారాయణఖేడ్‌లో సీఎం ప్రచార సభకు వెళ్తూ దాడి విషయం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు అటు వెళ్లకుండా నేరుగా దవాఖానకు చేరుకున్నారు. అంబులెన్స్‌లో ప్రభాకర్‌రెడ్డి యశోద దవాఖానకు చేరుకోగానే, దవాఖాన లోపలికి పరుగెత్తుకుంటూ వెళ్లారు. దవాఖాన సిబ్బందిని అప్రమత్తం చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. పక్కనే ఉండి ఎంపీ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు.

యశోదలో 4 గంటల పాటు సర్జరీ..

చిన్న పేగు కట్

ప్రభాకర్‌రెడ్డికి యశోద దవాఖానలో దాదాపు 4 గంటల పాటు సర్జరీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి కడుపులో చిన్న పేగుకు 4 చోట్ల గాయాలయ్యాయని, దీంతో కడుపులో రక్తం పేరుకుపోయిందని వివరించారు. అందువల్ల 15 సెంటిమీటర్ల మేర కడుపును కోతపెట్టి పేరుకుపోయిన రక్తాన్ని శుభ్రం చేశామని, చిన్నపేగును 10 సెంటీమీటర్ల మేర కట్ చేశామని వెల్లడించారు. సీటీ స్కాన్, ఈసీజీ, అన్ని రకాల రక్తపరీక్షలు, ప్రి-అనస్థీషియా పరీక్షలు వంటి పరీక్షలన్నీ చేశాకే సర్జరీ చేశామని తెలిపారు. ఆయనను గ్రీన్ చానల్‌తో హైదరాబాద్‌కు తరలించి ఉండకపోతే మరింత ఇబ్బందయ్యేదని చెప్పారు. రక్తం పేరుకుపోవటం, పేగుకు గాయాలు కావటంతో సర్జరీకి ఎక్కువ సమయం పట్టిందని వివరించారు. ప్రభాకర్‌రెడ్డి దవాఖానలో మరో వారం – 10 రోజులు చికిత్స పొందే అవకాశం ఉన్నట్టు వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స కోసం 50-100 మంది వైద్యులు శ్రమించారని వెల్లడించారు. కత్తి పదునుగా ఉండటం వల్ల గాయం లోతు ఎక్కువగా ఉన్నదని వివరించారు. ప్రస్తుతం ఆయనకు పోస్ట్ ఆపరేటివ్ సర్జికల్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. గ్యాస్ట్రోఎంటరాలజీ, క్రిటికల్ కేర్‌తో పాటు మల్టీడిసిప్లినరీ బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని పేర్కొన్నారు.

దవాఖానకు తీసుకొచ్చినప్పుడు స్పృహలో లేరు: డాక్టర్ మహిపాల్, గజ్వేల్

మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని చికిత్సకు గజ్వేల్ దవాఖానకు తీసుకువచ్చిన సమయంలో ఆయన స్పృహలో లేరని డాక్టర్ మహిపాల్ తెలిపారు. బీపీ స్థాయిలు తగ్గిపోయాయని, వెంటనే చికిత్స ప్రారంభించడంతో కొద్దిసేపటికి బీపీ అదుపులోకి వచ్చిందని వెల్లడించారు. కడుపులో కత్తితో పొడవటంతో పెద్దగాయమైందని, గాయమైన చోట 5 కుట్లు వేశామని వివరించారు. రక్తం ఎక్కువగా పోకుండా చికిత్స అందించామని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ దవాఖానకు సిఫార్సు చేశామని పేర్కొన్నారు.

అనుమానం రాగానే పట్టుకున్న

ప్రచారం ముగిసిన తర్వాత కారులో ప్రభాకర్‌రెడ్డి సార్ ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ఒక్కసారిగా కత్తితో దాడిచేశాడు. వెంటనే అతని వద్ద నుంచి కత్తిని లాక్కునే ప్రయత్నం చేశా. దాంతో నా చేతికే గాయమైంది. అందరు చూస్తుండగానే కత్తితో పొడిచాడు. రక్తం కారటంతో వెంటనే కారులో గజ్వేల్ దవాఖానకు తీసుకువచ్చాం. దాడి చేసిన వ్యక్తిని అక్కడున్న పార్టీ కార్యకర్తలు పట్టుకున్నారు.

-ప్రభాకర్‌రెడ్డి గన్‌మెన్

నిందితుడి అరెస్టు

- కేసు నమోదు, విచారణ ప్రారంభం
- గటాని రాజుపై అనేక ఆరోపణలు: పోలీస్ కమిషనర్ శ్వేత
- కాంగ్రెస్ నేతగా చెలామణి
- రాజకీయంతోపాటు రిపోర్టర్‌గా

సిద్దిపేట(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ దుబ్బాక, అక్టోబర్ 30: నిందితుడు గటాని రాజును అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టినట్టు సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీని కలిసేందుకు వచ్చి, కత్తితో కడపులోకి బలంగా పొడిచి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న రాజును అక్కడున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పట్టుకొని పోలీసులకు అప్పగించారని వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టామని పేర్కొన్నారు. నిందితుడు మిరుదొడ్డి మండలం చెప్యాలకు చెందినవాడని తెలిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజు.. ఇటీవల బీజేపీ నాయకులతో సంబంధాలు పెంచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఓ యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌గానూ పనిచేస్తున్నాడు. వివాదాస్పదుడిగా రాజుపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో చోట, ఒక్కో రకంగా జర్నలిస్టునంటూ, రాజకీయ నేతనంటూ పలువురిని బెదిరింపులకు గురిచేసి డబ్బులు వసూలు చేసేవాడని స్థానికులు చెప్పారు.

యశోద దవాఖానలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని తదితరులు

యశోద దవాఖానలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి కే తారకరామారావు, బీఆర్ఎస్ నేత చెరుకు సుధాకర్ తదితరులు

హత్యాయత్నం దురదృష్టకరం

- పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం
- ఆందోళన వద్దు.. ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుంది
- ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చిన సీఎం కేసీఆర్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం దురదృష్టకరమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిందితులపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సికింద్రాబాద్‌లో చికిత్స పొందుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డిని సోమవారం రాత్రి సీఎం కేసీఆర్ పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాలని అక్కడే ఉన్న మంత్రి హరీశ్‌రావును ఆదేశించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆందోళన చెందవద్దని ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం నాటి ఎన్నికల సభలను ముగించుకొని హెలికాప్టర్‌లో సోమవారం సాయంత్రం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న సీఎం.. నేరుగా యశోద హాస్పిటల్‌కు వెళ్లాలని భావించారు. అయితే ప్రభాకర్‌రెడ్డికి ఆపరేషన్ జరుగుతున్నదని.. ఇంకా రెండు, మూడు గంటలు సమయం పడుతుందని సమాచారం అందటంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో దవాఖానకు చేరుకుని ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. హాస్పిటల్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలకు కూడా సీఎం ధైర్యం చెప్పారు. ఆయన వెంట మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితరులు ఉన్నారు.

ఘటనను తీవ్రంగా ఖండించిన మంత్రులు

ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని మంత్రులు, ఎంపీలు తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో, ప్రజాస్వామ్యంలో దాడులు, హత్యాయత్నాలు సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. నిరాశలో కాంగ్రెస్ పార్టీ భౌతికదాడులకు దిగుతున్నదని మండిపడ్డారు. తమ నేతలను భౌతికంగా అంతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. థర్డ్‌రేట్ క్రిమినల్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించినప్పుడే ఇలాంటి ఘటనలను ఊహించొచ్చు అని అన్నారు. ప్రజాస్వామ్యంలో హింస, దాడులకు తావులేదని తేల్చి చెప్పారు. ఈ ఘటనపై ఈసీ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఘటన విషయం తెలుసుకున్న మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కేశవరావు, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ దవాఖానకు చేరుకొని కొత్త ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. ఘటనను ఖండించిన వారిలో మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీలు కే కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, అసదుద్దీన్ ఒవైసీ, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఆర్థిక సంఘం సభ్యుడు గోసుల శ్రీనివాస్‌యాదవ్, టీఎస్‌పుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ దక్షిణాఫ్రికా ఎన్నారై శాఖ నాయకుడు నాగరాజు తదితరులు ఉన్నారు.

పర్యటనలో ఫోన్‌లో సీఎం కేసీఆర్ ఆరా

ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పై హత్యాయత్నం జరిగిందని సోమవారం కామారెడ్డి జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ఉండగానే సీఎం కేసీఆర్‌కు తెలిసింది. వెంటనే మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించేలా సూచనలు జారీ చేశారు. హెలికాప్టర్ నుంచే ఫోన్‌లో మాట్లాడారు. హత్యాయత్నాన్ని సీఎం కేసీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజా తీర్పును ఎదుర్కోలేక భౌతిక దాడులు, హత్యా రాజకీయాలకు తెగబడటం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికల సమయంలో ఇటువంటి సంఘ విద్రోహుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు, బీఆర్ఎస్ నేతలకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎవరు దాడులకు పాల్పడ్డా సహించేది లేదని స్పష్టం చేశారు.

మంత్రి హరీశ్‌రావు ఉద్వేగం

ఎంపీని యశోదకు తీసుకురాగానే పరుగెత్తుకుంటూ వెళ్లిన మంత్రి

వైద్యులను అప్రమత్తం చేసిన హరీశ్.. ఉద్వేగంలో మీడియాముందు కన్నీరు

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి చీమకు కూడా హాని తలపెట్టరని భావోద్వేగం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. దాడి విషయాన్ని తెలుసుకున్న ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలిస్తున్నారని తెలుసుకొని, హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అంబులెన్స్ రాగానే, దవాఖానలోకి పరుగెత్తుకుంటూ వెళ్లి వైద్యులను అప్రమత్తం చేశారు. దగ్గరుండి అన్ని పరీక్షలు చేయించారు. ప్రతి క్షణం వైద్యుల నుంచి ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్.. ఉద్వేగానికి గురయ్యారు. కన్నీరు పెట్టుకున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డికి రక్తస్రావం తీవ్రంగా ఉన్నదని, గజ్వేల్ దవాఖాన డాక్టర్లు చెప్పడంతో వెంటనే హైదరాబాద్ యశోద దవాఖానకు తరలించామని వెల్లడించారు. డాక్టర్లు పరిశీలించి సీటీ స్కాన్ చేశారని, సర్జరీ చేయాలని ఆపరేషన్ థియేటర్‌కు మార్చారని వివరించారు. ఇది చాలా దురదృష్టకరమైన ఘటన అని చెప్పారు. ప్రభాకర్‌రెడ్డి చీమకు కూడా హాని చేసే వ్యక్తి కాదని, పదేండ్లుగా ఎంపీగా ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని తెలిపారు. సౌమ్యంగా ఉండే వ్యక్తి అని, మృదుస్వభావి అని వెల్లడించారు. ఆయన మీద దాడిని ఉహించలేకపోతున్నామని, తట్టుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. దాడి జరిగిన వెంటనే ఫోన్‌లో మాట్లాడితే.. 'చక్కెర వస్తుంది. కండ్లు తిరుగుతున్నాయి. నన్ను కాపాడండి' అంటూ ఏడ్చారని తెలిపారు. రాజకీయాల్లో ఇలాంటి కత్తి పోట్లు, ప్రత్యక్ష దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. రాజకీయంగా ఎదుర్కొవాలి తప్ప, భౌతిక దాడులు ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని తేల్చిచెప్పారు. వేంకటేశ్వర స్వామి దయతో ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ప్రభాకర్‌రెడ్డిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని, బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని అన్నారు. యశోద దవాఖానలో ప్రభాకర్‌రెడ్డి ఆపరేషన్ నాలుగు గంటలపాటు సాగగా, ఆందోళనతో మంత్రి హరీశ్‌రావు ఆపరేషన్ థియేటర్ వద్దే నిలబడి ఉన్నారు.

యశోద దవాఖానలో ఆపరేషన్ థియేటర్ వద్ద వేచి ఉన్న మంత్రి హరీశ్‌రావు

ఈ పాపం కాంగ్రెస్, బీజేపీలదే!

- ప్రభాకర్‌రెడ్డిపై దాడితో హింసా రాజకీయాలకు నాంది
- కొన్నేండ్లుగా ప్రతిపక్ష నేతల విద్వేషపూరిత ప్రసంగాలు
- కార్యకర్తల మనసుల్లో క్రమంగా విషబీజాలు
- ఎన్నికలవేళ ఉద్రిక్త స్థాయి దాటి హింసా ప్రవృత్తికి
- అహింసతో రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర కేసీఆర్‌ది
- పదేండ్లుగా శాంతియుతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి రాష్ట్ర రాజకీయాల్లో హింసాత్మక విధానాలకు తెరలేపింది. ఇది ఇప్పటికిప్పుడు జరిగిన పరిణామం కాదు.. ప్రతిపక్ష నేతలు కొన్నేండ్లుగా తమ విద్వేష ప్రసంగాలతో క్రమంగా కార్యకర్తల్లో నాటిన విష బీజాల ఫలితమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సుదీర్ఘకాలం శాంతియుతంగా తెలంగాణ ఉద్యమాన్ని నడిపారు. గాంధేయమార్గంలో అహింసాయుతంగా ప్రజలను ఐక్యం చేసి, జాతీయ స్థాయిలో పోరాటం చేసి, రాజకీయంగా అన్ని పక్షాలను ఒప్పించి దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేశారు. స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత పదేండ్లుగా రాష్ట్రంలో శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఎక్కడా అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా జాగ్రత్తపడ్డారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో బండి సంజయ్, రేవంత్‌రెడ్డి, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ వంటి కాంగ్రెస్, బీజేపీకి చెందిన నేతల ప్రసంగాలతో ఆందోళనకర పరిణామాలు మొదలయ్యాయని నిపుణులు చెప్తున్నారు.

అధికార దాహంతోనే..

కేవలం అధికారం దక్కించుకోవాలనే యావతో విద్వేష పూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టేలా ఉన్మాద ప్రసంగాలు చేస్తూ కార్యకర్తల మనసులను కలుషితం చేయడం ప్రారంభించారని పలువురు అంటున్నారు. బండి సంజయ్ అనేకసార్లు ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడారని, ఏకంగా 'మసీదులు తవ్వుదాం.. శివం బయటికి వస్తే మాకు, శవం బయటికి వస్తే మీకు' అంటూ విపరీత వ్యాఖ్యలు చేశారని గుర్తు చేస్తున్నారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ కార్యకర్తలపై.. ముఖ్యంగా యువతపై ప్రతికూల ప్రభావం చూపించాయని అంటున్నారు. గంగా- జమున తెహజీబ్ సంస్కృతి పరిఢవిల్లే తెలంగాణ గడ్డమీద సామాజికంగా చీలికలు మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక రేవంత్‌రెడ్డి తన అధికార దాహంతో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై, ప్రభుత్వంపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. ఏకంగా ప్రగతిభవన్ మీద బాంబులు వేస్తామని ఫిబ్రవరిలో బహిరంగంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈటల రాజేందర్ సైతం సభ్యసమాజం తలదించుకునేలా దూషిస్తున్నారని, 'ఎవడు రా కొడకా' అంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని, పదేపదే తన కులం పేరు వాడుతూ సామాజికంగా విభజన సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఉదహరిస్తున్నారు. బీజేపీకి చెందిన మరో నేత ధర్మపురి అర్వింద్.. 'కేసీఆర్ చనిపోతే బీజేపీ రూ. 5 లక్షలు ఇస్తుంది. కేటీఆర్ చనిపోతే రూ.10 లక్షలకు పెంచుతం. అదే కవిత చనిపోతే నేనే రూ.20 లక్షలు ఇస్తా' అంటూ బాహాటంగా ప్రకటించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రంలో నాయకులపై దాడుల సంస్కృతి వెలుగుచూస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ దాడికి ఒక వ్యక్తిని బాధ్యుడిని చేస్తేనే సరిపోదు

దుబ్బాక నియోజకవర్గం సూరంపల్లిలో సోమవారం జరిగిన దాడికి ఒక వ్యక్తిని బాధ్యుడిని చేస్తేనే సరిపోదని, రెచ్చగొట్టే ప్రసంగాలతో ప్రజల్లో విభేదాలు సృష్టిస్తున్న నాయకులందరి పాపం ఇందులో ఉన్నదని పలువురు మండిపడుతున్నారు. అధికారంలోకి రావడానికే ఇన్ని అరాచకాలకు పాల్పడితే.. ఒకవేళ వాళ్లు అధికారంలోకి వస్తే జరిగే పరిణామాలు ఊహించడం కూడా కష్టంగా ఉన్నదని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

గెల్వలేక దాడులా.. ఖబడ్దార్

I తరువాయి...

మీద దాడి. మాకే తిక్కరేగితే దుమ్ము దుమ్ము రేగుతది. సహనాన్ని పరీక్షిస్తే మా దమ్మేందో చూపిస్తాం.. తస్మాత్ జాగ్రత్త' అని నిప్పులు చెరిగారు. బాన్సువాడ, నారాయణఖేడ్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాదసభల్లో సీఎం కేసీఆర్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజలు గెలిపిస్తే గెలిచామని, ఎజెండా చెప్పి ప్రజలు గెలిపిస్తే పనిచేయాలె తప్ప గూండాగిరి ఏంటని ధ్వజమెత్తారు.

ప్రజాసేవకులపై దాడులా.. తస్మాత్ జాగ్రత్త!

సమస్యలపై యుద్ధం చేసుకుంటూ, శత్రువులను సైతం ఇబ్బంది పెట్టకుండా తాము ముందుకు పోతున్నామని, కానీ ప్రతిపక్ష పార్టీల వెధవలు దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తిపోట్లకు పాల్పడి దారుణం చేశారని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ గన్‌మెన్ అప్రమత్తంగా ఉండబట్టి, ఆ దుర్మార్గుడిని పట్టుకుంటే భగవంతుడి దయవల్ల ప్రాణాపాయం తప్పిందని వివరించారు. మంచి పనిచేసేవాళ్లను, మంచి పనిచేసే పార్టీలను ఇలా చేయడం ఏమిటని నిలదీశారు. కత్తులు పట్టుకొని తమ అభ్యర్థులపై దాడులు చేస్తున్న వారికి తెలంగాణ సమాజమే బుద్ధిచెప్పాలని కోరారు. 'కత్తి పట్టుకొని పొడవాలంటే ఇంతమంది ఉన్న మనకు చేతులు లేవా? మొండిదో.. లండుదో కత్తి మాకు దొరకదా?' అని నిప్పులు చెరిగారు. పదేండ్లలో ఎన్నో ఎన్నికలు జరిగాయని, తాము ఏనాడూ హింసకు దిగలేదని, ప్రజలు గెలిపిస్తే చేతనైన కాడికి సేవ చేస్తున్నాం తప్ప దుర్మార్గమైన పనులు చేయలేదని అన్నారు. 'ఈ దాడులు ఆపకపోతే, సెల్ఫ్ కంట్రోల్ చేసుకోకపోతే మాకు కూడా దమ్ము ఉన్నది. మేము కూడా అదే పనికి ఎత్తుకుంటే మీరు ఎక్కడ కూడా మిగలరు. దుమ్ము కూడా మిగలదు. మేం బాధ్యతతో ఉన్నాం' అని ప్రతిపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. 'మేం ప్రజలకు సేవ చేయాలనే పనుల్లో నిమగ్నమై ఉన్నం. కరెంటు ఎట్ల రావాలె, నీళ్లు ఎట్ల రావాలె, నిజాంసాగర్ ఎట్ల నిండాలె, పంటలు ఎట్ల పండాలె, పండిన పంటలను ఎట్ల కొనుగోలు కేంద్రాలు పెట్టి కొనాలె అనే పనుల్లో ఉన్నం. వారు (ప్రతిపక్షాలు) దుర్మార్గమైన పనులు చేసుకుంటూ ముందుకుపోతున్నరు. ఇకనైనా హింసా రాజకీయాలు వదిలి దమ్ముంటే ఎజెండా చెప్పండి. ప్రజలముందు మీ వాదన మీరు చెప్పండి. మా వాదన మేము చెప్తాం. ఎవరిని గెలిపిస్తే వాళ్లు పనిచేయాలె, లేకుంటే ఎవరికున్నపని వాడు చూసుకోవాలి. కానీ ఈ లంగా చేత లేంది. గూండాగిరీ ఏందీ? కత్తులుబట్టి పొడుచుడేంది?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.